క్లుప్తంగా

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం



మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామికి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే కృష్ణ అంగారక చతుర్థి పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి యూపీఎస్ వితరణ

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయానికి మండల కేంద్రానికి చెందిన గడ్డం సతీష్ అనే భక్తుడు రూ.50 వేల విలువ చేసే యూపీఎస్‌ను విరాళంగా అందజేశాడు. అదే విధంగా లక్ష్మీ నరసింహ శర్మ అనే మరో భక్తుడు రూ.60 వేల విలువ చేసే ఇన్వర్టర్‌ను విరాళంగా అందజేసినట్లు శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య మంగళవారం పేర్కొన్నారు.

తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారిగా గిరీషా



పీలేరు : మండలంలోని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ గిరీషా బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ వైద్యాధికారిగా పని చేస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి కేవీపల్లె మండలం గ్యారంపల్లె పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సదుం మండలం చెరుకువారిపల్లె పీహెచ్‌సీ నుంచి బదిలీపై వచ్చిన డాక్టర్ గిరీషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ మహేంద్ర

రామసముద్రం: రామసముద్రం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ కేసులకు చెందిన రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ- చలానా , శక్తి టీం , ఉమన్‌హెల్ప్‌డెస్క్ పనితీరుపై ఆరా తీశారు. సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా పెట్టి అక్రమ రవాణా, మద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు.


ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలుని సన్మానిస్తున్న టీచర్లు

రామసముద్రం: రామసముద్రం మాలపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎంటిఎస్ టీచర్‌గా రెండేళ్లు బాధ్యతలు నిర్వహించి బదిలీ అయిన హసీనాను ఆ పాఠశాల టీచర్లు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎంఈవోలు హేమలత, ఆంజనేయులు, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్‌లు ఉపాధ్యాయులు సన్మానించారు. హసీనా సేవలు మరువలేనివని , పాఠశాల అభివృద్ధికి ఆమె ఎంతో కృషి చేశారని కొనియాడారు.

దారి సమస్యకు శాశ్వత పరిష్కారం



దారి సమస్య పరిష్కరిస్తున్న తహసీల్దార్

పీలేరురూరల్ : మండలంలోని జాండ్ల కస్పా మూరేవాండ్లపల్లె గత కొంతకాలంగా నెలకొన్న దారి సమస్యకు తహసీల్దార్ శివకుమార్ శాశ్వత పరిష్కారం చూపించారు. గ్రామానికి చెందిన విశ్రాంతి అధ్యాపకుడు రాజా రామ్మోహన్ రెడ్డి, పార్వతమ్మ, రెడ్డెప్పల మధ్య కొన్నేళ్లుగా దారి సమస్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం తహసీల్దార్ గ్రామంలో పర్యటించి ఇరు వర్గాలను ఒప్పించి వారి అభిప్రాయం మేరకు రాజీ కుదిర్చి దారి సమస్య పరిష్కరించారు. కార్యక్రమంలో వీఆర్వో హేమంత్‌నాయక్, వీఆర్‌ఏలు నాగేంద్ర, అనిల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటితొట్టె..చుక్కనీరు నిలిస్తే ఒట్టే



కొత్తపల్లెలో పశువుల నీటితొట్టెలకు చీలికలు ఏర్పడడంతో నీరు నిల్వని దృశ్యం



దిగువ అమిలేపల్లెలో నిరుపయోగంగా పశువుల నీటితొట్టె

- కొత్తవిసరే.. ఉన్నవాటికి మరమ్మతులేవి?
- నిరుపయోగంగా పశువులతొట్టెలు
- మరమ్మతు చేయిస్తే వినియోగించుకోవచ్చు

గుర్రంకొండ: కొత్తగా మంజూరు అయినవి సరే.. గతంలో ఉన్న పశువుల తాగునీటి తొట్టెలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గతంలో నిర్మించిన నీటితొట్టెలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తే పశువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో గతంలో పశువుల దాహార్తి తీర్చడానికి ఉపాధిహామీ పథకం కింద నీటితొట్టెలను నిర్మించారు. గతంలో వర్షాలు కురవక చెరువుల్లో చుక్క నీరులేక గుక్కెడు మంచినీటికోసం పశువులు అల్లాడిపోయాయి. అప్పట్లో పశుసంపద ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రభుత్వం వేలాది రుపాయలు ఖర్చు చేసి నీటి తొట్టెలను నిర్మించించి. తొట్టెలు నిర్మించిన గ్రామాల్లో తొట్టెలకు నీటిని నింపే బాధ్యతను పంచాయతీలకు అప్పగించింది. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల్లోని పంచాయతీ బోర్ల నుంచి పైపలైన్లు తీసి తొట్టెలకు నీటి సరఫరా సౌకర్యం కల్పించి కొళాయిలు ఏర్పాటు చేయించారు. దీంతో అప్పట్లో పశువులు, గొర్రెలు, మేకలు ఈ నీటి తొట్టెల వద్దనే తమ దాహార్తిని తీర్చుకొనేవి. ఈనీటి తొట్టెలను పశువులు, గొర్రెల కాపరులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం పలు గ్రామాల్లో ఈ పశువుల నీటి తొట్టెలు శిథిలావస్థకు చేరుకొన్నాయి. అధికారుల సరైన నిర్వహణ లేక పోవడంతో గ్రామాల్లో నీటి తొట్టెలకు కొన్నిచోట్ల చీలికలు ఏర్పడ్డాయి. దీంతో నీరు నిల్వక లీకేజిల ద్వారా బయటకు వెళ్లిపాయే పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో కొద్దిరోజుల పాటు నీటి సౌకర్యం కల్పించి తదనంతరం వాటి గురించి పట్టించుకోవడం మానేశారు. దీంతో తొట్టెల్లో నీరు నింపేవారు లేక శిథిలమైపోయాయి. అయితే ఇప్పటికీ పలు గ్రామాల్లో నీటి తొట్టెలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

32 కొత్త తొట్టెలు మంజూరు:

మండలానికి ఉపాధిహామ పథకం కింద కొత్తగా 32 నీటి తొట్టెలు మంజూరు అయ్యాయి. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ. 34 వేలు నిధులు మంజూరు అయ్యాయి. ఎంపిక చేసిన గ్రామాల్లో వీటని నిర్మించాల్సి ఉంది. నీటితొట్టె నిర్మాణంతో పాటు తొట్టెలకునీటి సరఫరా సౌకర్యం కూడా కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే పలు గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణాలు పూర్తి అయ్యి వినియోగంలోకి వచ్చాయి. అయితే పాత నీటి తొట్టెల పరిస్థితి మాత్రం ఆగమ్య గోచరంగా మారింది. ఈవిషయమై ఏపీవో జయరామిరెడ్డిని వివరణ కోరగా కొత్తగా మంజూరైన నీటితొట్టెల నిర్వహణ బాధ్యత మాత్రమే మాకు వర్తిస్తుందన్నారు. గతంలో నిర్మించిన నీటితొట్టెలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చే బాధ్యత పంచాయతీలపైనే ఉందన్నారు. గతంలో నీటి తొట్టెలు నిర్మించిన గ్రామాల్లో కొత్తవి నిర్మించలేదన్నారు.

స్వర్ణ పంచాయతీ ద్వారా ఇంటి పన్నులు

డీపీఓ ఎ. రాధమ్మ



డీపీఓ రాధమ్మకు వినతిపత్రం ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పీలేరు : స్వర్ణ పంచాయతీ ద్వారా ఇంటి పన్నులు చెల్లించాలని డీపీఓ ఎ. రాధమ్మ అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 3,49,663 ఇండ్లు ఉన్నాయని, వాటికి గానూ రూ. 15 కోట్లు వసూళ్ల లక్ష్యం కాగా 60 శాతం మాత్రమే వసూలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 501 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, అయితే చెత్త సేకరణ కేంద్రాలు 434 వాడకంలో ఉన్నాయన్నారు. నేటి నుంచి అధికారులు స్వచ్ఛ సేవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించాలన్నారు. పీలేరు పట్టణంలో 26 ఆర్‌వో ప్లాంట్లు ఉన్నాయని, గత పది నెలలుగా సిబ్బందికి జీతాలు అందలేదన్న విసయాన్ని అడిగి తెలుసుకున్నారు. లైన్ రిజిస్టర్ తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికులకు డీపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవో లతీఫ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది

తంబళ్లపల్లె: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పని చేసిన ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డికి కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆయన బదిలీపై వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల ఎంపీడీఓగా వెళుతున్న సందర్భంగా ఆయనకు ఏఓ థామస్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఏడాదిలో సిబ్బందికి సహకరించిన తీరును కొనియాడారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా థామస్

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇప్పటి వరకు ఏఓగా విధులు నిర్వహించిన థామస్ మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన ఉపేందర్‌రెడ్డి పోరుమామిళ్లకు బదిలీ అయ్యారు.

కూటమి ప్రభుత్వంపై గళమెత్తిన సచివాలయ ఉద్యోగులు



కురబలకోటలో సచివాలయ ఉద్యోగుల నిరసన



పీలేరులో సచివాలయ ఉద్యోగుల నిరసన

కురబలకోట: కూటమి ప్రభుత్వ తీరుపై సచివాలయ ఉద్యోగులు గళమెత్తారు. బదిలీల విషయంలో సొంత మండలంలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కురబలకోట మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం వీరు నిరసన తెలియజేశారు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన బదిలీల జీఓను తప్పుపట్టారు. ఈ సందర్భంగా గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల బదిలీలు, రేషనలైజేషన్ కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబరు 5లో అసంబద్ధత ఉందన్నారు. ఉద్యోగులకు సొంత మండలంలో పోస్టింగ్ ఇవ్వరాదన్న నిబంధన విధించడం సరికాదన్నారు. దీని వల్ల తక్కువ వేతనాలు పొందుతున్న వారికి ఇబ్బందికరంగా మారిందన్నారు. జీఓను రద్దు చేసి సొంత మండలంలోనే పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రేషనలైజేషన్ తర్వాత మిగులు ఉద్యోగులను ఎక్కడ నియమిస్తారన్న దానికి కూడా జీఓలో స్పష్టత లేదన్నారు. దీంతో ఉద్యోగులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. రేషనలైజేషన్ ఇచ్చిన తర్వాతే బదిలీల ప్రక్రియ కొనసాగించాలన్నారు. లే ఇంతవరకు జాబ్ చార్ట్‌లేదని ఎవరు ఏం పనిచేయాలో తెలియక సతమతం కావాల్సి వస్తోందన్నారు. ప్రమోషన్ చానల్ కల్పించిన తర్వాతే బదిలీలు చేయాలన్నారు. జాయినింగ్ తేదీని పరిగణలోకి తీసుకుని రెండు నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలన్నారు. ప్రొబెషన్ ఆలస్యంగా ప్రకటించినందున ఆకాలానికి ఆరియర్స్ ఇవ్వాలన్నారు. ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి వేణు, జేఏసీ నాయకులు గణేష్, మంజునాథ్, మదనమోహన్‌రెడ్డి, రేణుక, శ్రీవాణి, రమేష్‌రెడ్డి, మురళి, మోహన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. నిరసన అనంతరం ఎంపీడీఓ గంగయ్యకు వినతిపత్రం సమర్పించారు.

గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు : గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఎంపీడీఓ శివశంకర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిపార్టుమెంటులో ప్రొబేషన్ డిక్లేర్ కాకుండా ఇప్పటి వరకు ఉన్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. గ్రామస్థాయి ఉద్యోగులకు సొంత మండలంలోనే ఉద్యోగ అవకాశం ఇవ్వాలి. గత ఆరు సంవత్సరాలుగా ఉద్యోగులకు ఉన్న తమకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన రేషనలైజేషన్‌లో భాగంగా రెండుమూడు సచివాలయాలను ఒకటిగా చేయడం వల్ల అధిక పని భారం పడుతుందన్నారు. జీవో నెంబరు 5ను సవరించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

టీసీ ఇవ్వలేదని ఫిర్యాదు

కలికిరి: ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్‌లు ఇవ్వడం లేదని మండలంలోని కలికిరి (ఇందిరమ్మకాలని) టి.చదివేవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సంతప్‌కుమార్‌పై ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం డీఈఓ, ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఐదవ తరగతి చదివిన విద్యార్థి నిఖిల్, 7వ తరగతి చదివిన దేవ ప్రకాష్‌లు కలికిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అక్కడ టీసీలు ఇస్తేనే టెక్ట్స్ పుస్తకాలు ఇస్తామని ఉపాధ్యాయులు చెప్పడంతో టీసీల కోసం జెడ్పీ పాఠశాలకు వెళ్లగా హెచ్‌ఎం టీసీ పుస్తకం పూర్తయిపోయిందని, డీఈఓ కార్యాలయం నుంచి తెప్పించి ఇవ్వాలని రోజులు గడుపుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై హెచ్‌ఎం సంపత్‌కుమార్, ఎంఈఓ కరీముల్లాను వివరణ కోరగా పాఠశాలలో టీసీ పుస్తకం పదవ తరగతి విద్యార్థులకు అయిపోయిందని, వీరికి టీసీ పుస్తకం తెప్పించడంలో రెండు రోజులు ఆలస్యమైందన్నారు. అందులోనూ పాఠశాలలో క్లర్క్ పోస్టు ఖాళీగా ఉండటంతో కొంత ఆలస్యమవుతోందన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణించే క్రీడాకారులను ప్రోత్సహించాలని క్రీడాభారతి జాతీయ కార్యదర్శి మధుమేఘనాథ్ అన్నారు. మంగళవారం మదనపల్లె రెడ్డీకాలనీలోని స్పోర్ట్స్ అరేనాలో జిల్లా క్రీడా భారతి సమావేశం నిర్వహించారు. అసోసియేషన్‌లతో మమేకమై ముందుకు సాగాలని సూచించారు. ఆటలు ఆడాలి, ఆనందంగా ఉండాలి, ఆరోగ్యంగా ఉండాలన్నదే క్రీడాభారతి ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా వ్యాప్తంగా కేంద్ర కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అసోసియేషన్ నాయకులకు పలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో క్రీడాభారతి రాష్ట్ర కార్యదర్శి ధనుంజయరెడ్డి, సహ కార్యదర్శి సురేంద్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్, నరేష్‌బాబు, ఉపాధ్యక్షులు విజయకుమార్, విష్ణు,చైతన్య, మురళీధర్, యూసఫ్, మహేంద్ర, పీడీలు రాజు,బాలాజీ, చలపతిరెడ్డి, మణి, గురు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో పండ్ల తోటలకు ప్రాధాన్యత

– పీడీ వెంకటరత్నం



ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

కేవీపల్లె : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్లతోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పీడీ వెంకటరత్నం అన్నారు. మంగళవారం మండలంలోని గ్యారంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పనుల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. కూలీలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రోజుకు రూ. 307 కూలీ వస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఎవరూ పనుల కోసం వలసలు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పిస్తామని తెలిపారు. ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకుని చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటలు పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో నాగరాజు, టీఏ చంద్రబాబు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

టీబీ ముక్తభారత్ ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ

గుర్రంకొండ: టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీహెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్‌రఫీ, వాల్మీకీపురం టీబీ సబ్‌యూనిట్ ఆఫీసర్ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ ఇ. పసలవాండ్లపల్లెలో 104 సేవల్లో భాగంగా టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా మద్యం సేవించేవారు, హెచ్‌ఐవీ పాజిటివ్ వ్యక్తులు, బాస్‌మాస్ ఇండెక్స్18 కంటె తక్కువగా ఉన్నవారు, గర్భిణులు, చక్కెర వ్యాధి ఉన్నవారు ఎక్కువగా టీబీకి లోనయ్యే ప్రమాదం ఉందన్నారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరు దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి నిర్ధారణా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాసులు, సీహెచ్‌వో సుజనా, ఆరోగ్యసిబ్బంధి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం



ఎన్.కమతంపల్లి పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఎంఈవో హేమలత, హెచ్‌ఎం

రామసముద్రం: మండలంలోని ఎన్.కమతంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఒకే రోజు 21 మంది విద్యార్థులు చేరడంపై ఎంఈవో హేమలత అభినందించారు. ఇందుకు కృషి చేసిన హెచ్‌ఎం మహమ్మద్‌ఖాన్, జ్యోతి, లక్ష్మీదేవి, సయ్యద్‌బాషాల పనితీరుపై ప్రశంసించారి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి వారు చేస్తున్న కృషిని కొనియాడారు. ఇందులో చాలా మంది ప్రైవేటు పాఠశాల నుంచి చేరినవారేనని , ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యతో పాటు పుస్తకాలు, బూట్లు , బ్యాగులు ఉచితంగా మధ్యాహ్న భోజనం అందిస్తున్నందున విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు.

అక్రమకట్టడాలపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె రూరల్: మదనపల్లె ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్ రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, ఏపీఐఐసీసీ చైర్మన్ మంతెన రామరాజులకు ఫిర్యాదు చేశారు. మదనపల్లె ఎస్టేట్‌లో కొంత మంది పరిశ్రమల కోసం స్థలాలు తీసుకుని పరిశ్రమలకు కాకుండా కమర్షియల్ పర్పస్ కోసం వాడుతున్నారన్నారు. నియమ,నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా మూడు,నాలుగు అంతస్తుల భవనాలను నిర్మిస్తూ, సెల్లార్లను నిర్మిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు అవినీతికి పాల్పడుతూ అధికార ప్రలోభాలకు లోనవుతూ ఎన్నిసారుల ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని అక్రమకట్టడాలను ఆపాలని, నిర్మించిన వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరికృష్ణ, నిజాం తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులు



హర్షవర్ధన్



కృత్తిక



పూజ



మమత



రేవతి



భాను శేఖర్‌రెడ్డి



జీవన్‌చందు



యూనుస్‌అహ్మద్



ఎం.స్నేహ



వై.వాసవి



జెన్నిఫర్ సలోని



హర్షియ



సబిహా



లక్ష్మీప్రియ

మదనపల్లె సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. స్థానిక మాయబజార్‌లోని వివేకానంద (మాయాబజార్) ఉన్నత పాఠశాలకు చెందిన హర్షవర్ధన్, పురం కృత్తిక ఎంపికయ్యారు. ఆర్‌ఆర్ లేవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పి.ధనుశ్రీ, కె.తేజశ్రీ, పి.లహరి, బి.వైష్ణవి, ఈ.భవ్యశ్రీ, పి.దీక్షిత, బి.కార్తీక్, బి.హేమావతి, బి.బిందు, బి.కీర్తన, బి.హరితలు ఎంపికయ్యారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రబాబు, విజయలక్ష్మిలు అభినందించారు.

పీలేరు నుంచి..

పీలేరు రూరల్ : మండలంలో పది మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీకి ఎంపికై నట్లు ఎంఈవో పి. లోకేశ్వర్‌రెడ్డి, బి. పద్మావతి తెలిపారు. మండలంలోని జంగంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పూజ, మమత ఇడుపులపాయకు, రేవతి ఒంగోలుకు, పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. భానుశేఖర్‌రెడ్డి నూజివీడుకు , కోటపల్లె బాలుర నుంచి ప్రశాంత్‌నాయక్ ఇడుపులపాయకు, కోటపల్లె బాలికల పాఠశాల నుంచి అమృత, గాయత్రి ఇడుపులపాయకు, మహాత్మాజోతీరావుపూలే గురుకుల పాఠశాల నుంచి అక్షయ నూజివీడు, షాలిని నూజివీడుకు, హేమశ్రీ ఒంగోలుకు ఎంపికైనట్లు తెలిపారు.

కేవీపల్లె : మండలం నుంచి ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో రెడ్డిబాషా తెలిపారు. మండలంలోని గ్యారంపల్లె కొత్తపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన సి. జీవన్‌చందు, సొరకాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన సయ్యద్ యూనుస్‌అహ్మద్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు వివరించారు.

నిమ్మనపల్లె: నిమ్మనపల్లె జెడ్పీ ఉన్నత (తెలుగు) పాఠశాలకు చెందిన ఎం.స్నేహ, వై.వాసవిలు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారు. సోమవారం విడుదల చేసిన ఎంపిక జాబితాలో వారికి స్థానం దక్కింది. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం అంజాద్‌అలీఖాన్, ఎన్‌సీసీ అధికారి గోపాల్, ఉపాధ్యాయబృందం అభినందించారు.

కలికిరి: మండలంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల నుంచి అత్యధికంగా ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలకు ఎంపికకాగా, అలాగే బాలికోన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గురుకుల పాఠశాల నుంచి ఆర్‌కే వ్యాలీ కాంపస్‌కు ఎ.లక్ష్మీప్రియ, ఎల్.దివ్య, వి.కావ్యశ్రీ, ఒంగోలు కాంపస్‌కు జే.లతశ్రీ, పి.సుధ, ఎ.రెడ్డి శ్రుతి, నూజివీడు కాంపస్‌కు బి.శిరీషా, బాలికోన్నత పాఠశాల నుంచి జెన్నిఫర్ సలోని ఇడుపులపాయకు, హర్షియ ఒంగోలు కాంపస్‌కు, సబిహా శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికయ్యారు.